# భర్తారూ... హార్తిపోయారు

డాక్టర్ పి.వి.రమణ

**పున్నాగపూల** వెన్నెలా నేలపై పరుచుకున్న వెన్నెల పూతను చూస్తుంటే పార్వతీశానికి ఏ పగటి దృశ్యాన్నో చూసినట్లనిపించటం లేదిప్పుడు. ఆ జ్యోత్స్నా ప్రసూత్తు, దివి ద్వారం నుండి భువి తీరానికి చేరిన మమతానుబంధాల పులకరింపుల స్మృతికి మధుర వరంగా అనిపిస్తున్నది అతనికి ప్రస్తుతం.

వసంతం ప్రసాదించిన అశల చిగుళ్ళ లేవ సొగసులు, సన్నజాజుల ఆర్ద్ర పరిమళం, తరుణ కిరణాల ఆహ్లాదమయ స్పర్శ, నవచైతన్య చేతనకు అద్దం పట్టినట్లున్న ప్రకృతి, కొండల గుండెలను దూసుకుంటూ వచ్చే సెలయేళ్ళు, ఇవన్నీ చూస్తున్నప్పుడు లోగడలా బిక్కు బిక్కుమంటూ కుప్ప కూలి పోవటం లేదు పార్వతీశం. వీలైతే పరామర్శించే పవన ప్రవాహంలో కేరింతలు కొట్టాలన్నంత ఉబలాటం ఉంది ఇప్పుడు పార్వతీశానికి. వీలైతే భయాన్ని గుండెల్ని పిండి వేసే వేదననే కాదు—మృత్యువునే ఎదిరించి జీవించాలన్నంత ఆరాటంగా ఉందతనికి.

మంచుగడ్డల వర్షం, రాత్రి మెరుపు మొగ్గల్లా బలిపించే నక్షత్రాలు, పర్వత శిరశ్శిఖరాలు, తరుముకుంటూ పోయే కరిమబ్బులు, తరువుల్ని పెనవేసి కొనే తరుణ లతికలు—ఇవ్వన్నీ లోగడ అతని ఎదను తవ్విన విషాద అనుభూతులే! అతని మనసుపు పిల్చిన విట్ఫార్పుల ఘోషలే!

ఇప్పుడు దోసిళ్ళ కొద్దీ ఆ ప్రకృతి సౌందర్య ప్రవాహాన్ని జుర్రు కోవాలన్నంత తపన, తహతహ. గొంగళిపురుగు సీతాకోక చిలుకలా పరిణామం చెంద టానికి ప్రకృతి నుండి ఎన్ని పాఠాలు నేర్చుకుందో! అట్లాగే పార్వతీశం తన చుట్టూ కమ్మి వేసిన విషాదాన్ని తుడిచి వేసుకొంటూ, క్షోభను నెట్టి వేసుకుంటూ, కాలం ఉరవడిలో చిందులాడి ఆత్మీయతా బంధాల ఒడ్డుకు చేరాడు. చేరాక అతనిలో ఎంత మార్పు! ఎంత విస్తరించిన ఆశావాదం అతని మనసులో! ఏవో కనిపించని కోరల మధ్య నలిగి పోయే జీవిలా, ఇరుసులో ఇరుక్కుని రాపిడి చెందే శాపగ్రస్తునిలా, ప్రకృతి ఘోషంతా తన ఘోషే నన్నంతగా పరితపించిన పార్వతీశానికి — ఇప్పటి పార్వతీశానికి ఎంత తేడా! అప్పటి పార్వతీశం లోలోతుల్నుండి వేటు వేసిన అశాంతి గర్భాన్ని చీల్చి చూస్తే, మనసును కాలపు పొరలలోకి మళ్ళించి పరికిస్తే—రెండేళ్ళ క్రితం—

పిల్లా జెల్లాతో కలిసి ఇల్లు దాటి బయటకు పోవటమంటే చచ్చేంత భయం పార్వతీశానికి. అందులో ఏ సినిమాకో, మరేదో ప్రోగ్రాంకో సకుటుంబంగా పోవటమంటే బిక్కు బిక్కుమనేది గుండె. ఆ మాట కొస్తే ఇంట్లోనే కూర్చుని భార్యతో కరువు తీరా కబుర్లాడుతూ పరాచికాలు పరస్పరం పంచుకుంటూ కాలం దొర్లిస్తాడను కోవటం పొరపాటు. ఎదురు బొదురూ కూర్చుని మనసు విప్పి అర్ధాంగితో మాట్లాడా లన్నా పార్వతీశానికి బెరుకు. ఈ బెరుకుకు అనేక కారణా లున్నాయి. విడమరిచి చెప్పలేనంత గతం ఉంది.


హాలిడే స్పెషల్ ట్రైన్ పార్వతీశం సకుటుంబంగా సినిమాకు వెళుతుంటే, వెనక నుండి యువ్వనపు చాయల్లోకి అడుగు పెట్టిన కుర్రవాళ్ళ కామెంట్.

"ఇదంతా ఈ తల్లి కడుపు చలవేనా? ఇందుకు మూలపురుషుడివి నువ్వేనా, నాయనా?" అన్నట్లుగా తమ దంపతుల వైపు గుచ్చి గుచ్చి చూసే ముష్టి చూపులు, వాళ్ళ శ్రాద్ధపు పరిశీలనా పరికింపులు. కసి తీరా తిట్టుకునే వాడు పార్వతీశం. వీలైతే ఆ చూపుల రాయుళ్ళను విరుచుకు తినేయాలన్నంత ఉద్రేకంతో పూగిపోయేవాడు. అయితే, ఈ ఆవేశాలు, వూగి పోవటాలు మరొ కంటికి చేరనంతటి గుంభనలో ఉండేట్లు జాగ్రత్త పడేవాడు. చాలాసార్లు పార్వతీశం ఉద్రేకం అర్ధాంగి ప్రశాంత మౌనంలో జావకారిపోయేది. అతని లోని అంతర్ఘర్షణలు, కల్లోలాలు ఆమె నిండైన నిగ్రహంతో నీరు కారిపోయేవి. ఇది జీవిత అనుబంధం. ఒకరికి మరొకరుగా అన్నట్లుగా అల్లుకుపోయిన పవిత్ర బంధం అన్న భావంలో నిండిన అర్ధాంగి ప్రవర్తన ముందు పార్వతీశం సంకుచితత్వం, దాని తాలూకు పిలకలు వేసే పలవరింపులు, పరిరాపాలు తలలు వంచుకుని నిలబడేవి.

ఇప్పుడు భార్యామణి, నా బొంద మణి, ఈ సాయంత్రం మళ్ళీ మరో ప్రోగ్రాం వేసింది. లహ. ఆజ్ఞ జారీ చేసింది. దిక్కుమాలిన సినిమా. మరో దిక్కు మాలిన థియేటర్, అంతకన్నా దిక్కుమాలిన పనీ పాటా లేని జనం. అసహనంతో కదిలి పోయాడు పార్వతీశం. ఆ అసహనం తాలూకు చిహ్నాలన్నీ అతని ముఖాన్ని ఆవరించి నల్లగా కమిలగొట్టాయి. కక్క లేని, మింగలేని విషాద భరితమైన దయనీయ అవస్థలో పార్వతీశం. అతని మనసుకు గండి పడింది. అదు పూ ఆ పూ లేకుండా చిమ్ముకొస్తున్న ఆలోచనలు. ఆత్మ శోధనలు. విశ్వంలోని వివిధ మనశ్శకుస్తుల భూమికలు. విభిన్న ప్రవృత్తులు. విపర్యాయ దశలు. ఇవన్నీ రేఖా చిత్రాలై, ప్రకరణాలై పార్వతీశం కళ్ళ ముందు వర్ణ దృశ్యాల్లా కదలాడ సాగాయి.

అవును ... అవేవో దేశాల్లో కాపురాలంటే కాగితం పడవలు. ఒకరి పట్ల మరొకరి విశ్వాసం ఏ ఇంత సన్నగిల్లినా, అలవాట్లలో, అనుభూతుల్లో రవ్వంత అసంతృప్తి కలిగినా ఒక్క క్షణం కలిసి ఉండరు. పరిష్కారం—విధిగా విడిపోవటం. నా బొంద పెళ్ళిళ్ళు ... బులపాటం పెళ్ళిళ్ళు ... పార్వతీశం నిప్పులు తొక్కినట్లు చిందులేశాడు. అట్లా విడిపోయిన భార్యాభర్తలు నిమిషాల మీద వేరే భాగస్వాముల్ని వెతుక్కుని నూతన దంపతులుగా వేడుక చేసుకుంటారు. పార్వతీశం మనసు మండిపోయింది. అతని నరాల నూనె మరిగించిపోసినట్లు హోరు హోరు మన్నాయి. విడిపోయి మళ్ళీ అటువంటి అర్జంటు వివాహాలు చేసుకొన్న దంపతులు ఏ మూలనో పడివుండక దేశం మీద పడతారుట. విహారానికి. ఆ విహారాలలో ఎన్ని వింతలు! ఎన్ని వినోదాలు ... ఆలోచిస్తున్న పార్వతీశం మనసు అసంతృప్తితో భుగభుగమంది. అసహనంతో అవయవాలు సెగల శాఖల్లా జ్వలించినై. సాలెగూళ్ళలో చిక్కుకొని సౌధాల్లో నివసిస్తున్నా మనుకొనే మనుషులలా, ఎండమావుల అలల్ని అందుకొని దప్పిక తీర్చుకోవాలనుకునే ప్రయత్నం ... వీళ్ళ పిండాకూడు దాంపత్యాలు ... ఒళ్ళు తిమ్మిరెక్కి కొట్టుకు చస్తున్నారు. ముక్కులు చిట్లించి హుంకరించాడు పార్వతీశం. స్వానుభవం గుర్తుకొచ్చి, చెంపమీద ఎవరో చెళ్ళున చరిచినట్లు ఆక్రోశించిపోయాడు. క్రమంగా ఆ ఆక్రోశం సమసిపోయి, ఏదో ఉదాసీనత జొరబడింది. ఆ ఉదాసీనాన్ని ఆవహ్యించుకొంటున్న నీరస విస్రాణాలు.

ఆ రామ్మూర్తిగాడే దీనంతటికి మూలకారణం. తేట నీటి ప్రవాహంలో తుప్పుపట్టిన ఇనుపముక్క వేస్తే అటు నీరూ, ఇటు ఆ ఇనుప ముక్క రెండూ భ్రష్టమవుతా యంటారు. అట్లాగే వాడి భ్రష్టమైన ఆలోచనలతో తన బ్రతుకును రొష్టు పట్టించాడు. వాణ్ణి ఉప్పు పాతర్లో దించాలి. చీపురు చేతికిచ్చి రోడ్ల మీద వూడిగం చేయించాలి. వెధవ, తన బ్రతుకు వాడి పథకాల కొక ప్రయోగశాలగా అయింది. వాడి ఎక్స్పెరిమెంట్స్‌తో, నానావిధ ప్రయోగాలతో వింత ప్రహసనంలా తయారైంది



తన జీవితం. అయినా ఆ వరకు సంతోషమే.
మరోసారి ఉద్రేకంతో వూగిపోయాడు పార్వతీశం. కళ్ళముందు లేని రామ్మూర్తి మీద విస్తుపట్లు ఆరంభించాడు. పార్వతీశం మనో నేత్రం ముందు గత స్మృతుల తాలూకు సందడి. చెదిరి చెదిరి పోయిన జ్ఞాపకాలన్నీ ఒక్క కుదురుగా కదురుకొని పార్వతీశం ముందు నిలబడ్డాయి.

ఆఫీసు లంచ్ అవర్‌లో రామ్మూర్తి గాడు తనను సమీపించాడు. అంతవరకూ ఫర్వాలేదు. ఏ కాఫీ కోసమో కావాల్నాడ పోతున్నాడేమోనని తాను భావించాడు. నాడిచ్చిన వెర్రి మొర్రి సలహాకు తాను మొదట్లో నివ్వెరపోవటం, ఆపై తటపటాయించటం, ఆ తర్వాత మౌనం వహించటం, ఆ మౌనాన్నే అస్త్రంగా మార్చుకొంటూ వాడు విజృంభించటం ... పార్వతీశం విలవిల్లాడిపోయాడు. గతం అంటేనే భూతం ఆవహించినట్లు వణికిపోయాడు. అయినా ఆ గతం తాలూకు ఛాయలు ఇంగువ కట్టిన గుడ్డలా అతన్ని అంటి పెట్టుకొనే ఉన్నాయి.

"పార్వతీశం! నీ నుండి నా కో సమాధానం కావాలి." ప్రశాంతంగా అడిగాడు రామ్మూర్తి.

"ఏమిటది?"

"నిజాయితీకి మించిన సంపద లేదంటారు మనిషికి. మనసులోని ఆర్తిని, వేదనను, ఆవసరాన్ని మరో మిత్రునితో కలిసి పంచుకోవటం అదృష్ట మంటారు ..."

"ఇంతకీ ఏమిటి నువ్వు చెప్పబోయేది?" రామ్మూర్తి మాటలని మధ్యలోనే త్రుంచివేస్తూ అడిగాడు పార్వతీశం.

"ఆవేశపడకు. ఇది నీ భావిజీవితానికి సంబంధించింది. ఒంటరితనంకన్నా మించిన శాపం మనిషికి వేరే లేదంటారు. అంతకుమించిన శత్రువు ఉండదంటారు. ఆ ఒంటరితనం కల్పించే విపత్కర స్థితికి బాహికంగా, అంతరికంగా మనిషి కుమిలారి పోవాల్సిందే." చెప్తున్న రామ్మూర్తిని పార్వతీశం గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

"ఒంటరి మనిషి జీవితం కొయ్య గుర్రం లాంటిదిరా. కోటి ఆమడలు పరుగు తీయాలనే మనసుకు ఈ కొయ్య గుర్రం ఏ విధంగా బాసట మీయగలుగుతుంది? సముద్రం హోరెత్తుతూ ఉంటుంది—ఒడ్డు దాటాలనీ, నేల తల్లి ఒడిలో ఒదగాలని. కాని ప్రయోజనం? అఖండ దీపికలా వెలగాల్సిన మనిషి జీవితాన్ని అర్ధాంతరంగా కొడిగట్టించగల ఘనత కూడా ఈ ఒంటరితనానిదే .. వింటున్నావా,పార్వతీశం?" రామ్మూర్తికి సమాధానం ఇవ్వకపోగా విసుగ్గా చూశాడు పార్వతీశం.

"అదేరా. ఈ విసుగే కాదు. తన ఉనికే తనకు భారంగా చేసి, నిరాశతో, నిర్లిప్తతతో ప్రతి క్షణాన్ని చీకటి గూటిలో కాపురం పెట్టించే స్థితికి ఈడ్చుకుపోతుంది మనిషిని ఏకాకితనం. అప్పుడు మిగిలేదేమిటి? జీవరేఖల శిఖరాలలో చీకటి వూతలు. పంజరంలోని పక్షికి పరిష్కారం దొరకనట్లే, అది పసిడి పంజరమైనా, ముత్యాలు పేర్చినదైనా విహంగ జీవితానికి విముక్తి ఉండదు. ఆ విధంగానే ఎన్ని హంగులున్నా, ఆర్భాటాలున్నా ఒంటరితనం మరణానికి నేపథ్యమేలా!" చెప్తున్న రామ్మూర్తి పాలోచనగా పార్వతీశం వైపు చూశాడు.

"ఒంటరితనం కావాలని కోరుకునే వాళ్ళు లేరంటావా?"

"అది మహర్షులకు, వేదాంతులకు, మహాకవులకే పరిమితమైన భావన."

"సామాన్యులకు కాదంటావు?"

"ఈ ఉరుకుల పరుగుల జీవన ఆరాటంలో అలిసి పోయిన వ్యక్తి ఎప్పుడు ఇంటికి చేరుదామా అని తాపత్రయ పడుతుంటాడు. దేనికి? అక్కడ లభించే చల్లని చూపుల మధ్య సేద తీర్చుకోవటానికి? వాత్సల్యానురాగాల అమృతత్వంతో కొత్త వూపిరి నింపుకోవటానికి. అర్థమవుతున్నదా, పార్వతీశం. మిత్రునిగా నాదో అభ్యర్థన. నీవు మళ్ళీ వివాహం చేసుకోరా." చెబుతూ ఆశగా పార్వతీశం వైపు చూశాడు రామ్మూర్తి.

మంచు పొగను చీల్చు కొచ్చిన వెలుగు రేఖలా రామ్మూర్తి కళ్ళల్లోనూ ఏదో తెలియని తృప్తి లాస్యం చేస్తూ, మ్లానం కమ్ముకున్న ముఖాన్ని కొద్దిగా ప్రసన్నం చేసింది. మిత్ర ధర్మంతో తను విప్పి చెప్పిందంతా పార్వతీశం చేదు నిజాల తెరవాటిగా భావించి తీసి పారేయడన్న విశ్వాసం రామ్మూర్తి హృదయంలో కొత్త నాదాలకు పల్లవిని ప్రసాదించింది.

పార్వతీశం కొన్నిక్షణాలు ఆలోచించి అన్నాడు.

"వివాహమే వివేకమైన మార్గ మంటావు. నా సమస్యకు పరిష్కార మంటావు."

"సమస్యకు పరిష్కారం, జీవితానికి పరమార్థం కాకపోయినా, నీ మనస్తత్వం సంపూర్ణంగా చదివిన







నాకు నీకు ప్రస్తుతం తోడు ఎంత అవసరమో గ్రహించ గలిగాను. నీవు కోరుకునే లక్ష్యానికి చేరుకోవాలనుకునే గమ్యానికి నీకు సరైన అండ అవసరం. ఇదేదో ప్రణయ సరదాల కోసమో, పరవశాల వివశత్వం కోసమో కాదు నేను చెబుతున్నది. శోక సంసార కూపంలోకి బలవంతాన నిన్ను నెట్టి ఒడ్డున ఉండి నేను వినోదిద్దామని ఆంతకంచే కాదు. మడి పండడానికి నీరు ఎంత అవసరమో స్నేహం, వాత్సల్యం, ఆత్మీయతలతో జీవితం చిగురించాలన్నా మరో స్త్రీ సహచర్యం నీకూ అంతే అవసరం. ఆ హస్తం అందుకున్నప్పుడు జీవితం పట్ల ఇప్పుడు నీ కేర్పడ్డ విరక్తి, విర్లిప్తత రూపు మాసి పోవటమే కాదు. నవ చైతన్యంతో నీ మనసు రాగరంజిత మవుతుంది. ఆలోచనల్లోని నీలి అరలు, పొరలు అన్నీ ఏకీకృతమై, ఆదర్శాలకు, ఆశయాలకు విముక్తి పథం గోచరిస్తుంది. జీవితమే సజీవ వాహినిలా శరవేగంతో ప్రవహించి పోతుంది.''

''నా కా అనుభవం కొత్త కాదుగా'' ఆశ నిరాశల సంధి బంధం నుండి పెకలించుకు వచ్చిన స్వరంతో అన్నాడు పార్వతీశం.

''నిజమే, ఆమె జీవన్మరణాల ఆవలి గట్టుకు వెళ్ళిపోయింది.''

''వ్యుతి కన్నా, స్మృతి గొప్పదంటారు. ఆమె స్మృతులే చాలు నాకు'' గతానుభూతుల స్పర్శలో పులకిస్తూ అన్నాడు పార్వతీశం.

రామ్మూర్తి పార్వతీశాన్ని పరికించి చూశాడు. ఆ చూపులో ఆప్యాయత, అనురాగాలు.

''పార్వతీశం ఆ స్మృతులు రంగు రంగుల సబ్బు నీటి బుడగల వంటివి. ఏ క్షణంలోనైనా పేలిపోతాయి. మళ్ళీ వైరాశ్యపు క్రీనీడలు. నా మాట విను. ఒక స్నేహితునిగా, నిన్ను అభ్యర్థిస్తున్నాను. నీ మేలు కోరే వాడిగా మరో జీవికి నీ స్నేహ హస్తాన్నందించి, నీ ప్రస్థానంలో తోడు నిలుపుకోమని మనసారా సలహా ఇస్తున్నాను.''

''ఆత్మవంచన చేసుకోమంటావ్. మళ్ళీ పెళ్ళి అంటూ ప్రేమ మైకంలో పడిపొమ్మంటావ్.'' పైకి పార్వతీశం అలా అంటున్నా అతని స్వరలో ఏదో మధురగీతం లాలూకు ఆలాపన అల్లుకుని ఉంది.

''ఇందులో ఆత్మవంచన ప్రశ్నేముంది? మరో ఉజ్వల నాదంతో నీ ఆదర్శాల ఒడి నింపుకోమంటున్నాను. అభయమిస్తూ నిన్ను జేరే మరో జీవితో కలిసి, ఆప్యాయతానుబంధాలకు పోరలు ఒందీయమంటున్నాను. మసి బారిన నీ జీవిత చిత్రాన్ని కొత్త రంగులతో అలంకరించుకో మంటున్నాను. నిజం చెప్పు, నీకు మళ్ళీ వివాహం మీద వాంఛ లేద? మరో తోడు కావాలన్న ఆరాటం లేదా? అయినా నీ వయసు మాత్ర మెంత, పార్వతీశం, మూడు పదులు నిండలేదు!'' చెబుతున్న రామ్మూర్తి స్వరంలో చెలమ నుండి పొంగు కొచ్చే చెలిమి ధార.

పార్వతీశం మనసులో మహార్ణవాల ఘోష. అతని గుండె అంతర్ఘర్షణల సుడిగుండంలా అయింది. ''నిజమే. తన పాత్ర ఈ జీవిత రంగస్థలం నుండి తప్పుకోక ముందే మరో స్త్రీ పాత్ర ప్రవేశ అవసరం ఉంది. ఆ పాత్ర ఎంత త్వరగా ప్రవేశిస్తే అంతమంచిది. జీవన రంగస్థలం అప్పుడే కాంతివంత మవుతుంది. ఈభావం తన మనసును ఆవహించి చాలా కాలమైంది. తనే తాత్సారంచేస్తూ వచ్చాడు'' తనలోనే తను సణుక్కున్నాడు పార్వతీశం.

పార్వతీశం రామ్మూర్తులది పైపై స్నేహంకాదు. క్షణంలో ఆరి వెలిగే మెరుపు లాటిది అంతకన్నా కాదు. వారిమధ్య మైత్రి మనసు పొరల లోలోతుల కంటా వెళ్ళి బలమైన బంధం వేసింది. ఫలితంగానే రామ్మూర్తి మిత్ర ధర్మ నేపథ్యానికి మచ్చటైన రాగాలాపన జత చేశాడు.

''ప్రభుత్వోద్యోగంలో ఉంటూ, నెలకు నాలు గంకెలు పైచిలుకు సంపాదన గల, పిల్లా జెల్లా ఏ బాదర బందీలేని, భార్య చనిపోయిన, బుద్ధిమంతుడైన, ముప్పై సంవత్సరాల వ్యక్తికి, అణుకువ, విధేయత, విశాల భావాలు కల వధువు కావలెను. సంతానం లేని విధవ రాలైనను పరిశీలించబడును.''

పార్వతీశం గింజుకుంటున్నా, మొత్తుకుంటున్నా పట్టించుకోకుండా, ధైర్యాన్ని నూరి పోసి, తన కార్యక్రమంలో భాగంగా వివాహ ప్రకటన పత్రికలో ఇవ్వనే ఇచ్చాడు రామ్మూర్తి. పార్వతీశం హృదయాంతరాల్లో మెదలే వూహలకు సవ్యమైన రూపకల్పన ఇదే నన్న భావరి రామ్మూర్తిని నిగ్రహ పరచటమే కాదు. సమస్యకు పరిష్కారంలో ఈ ప్రకటనకున్న ప్రాముఖ్యం మనసులోకి వచ్చి రామ్మూర్తి ముఖం ప్రసన్నతతో వెలిగిపోయింది. నిస్సహాయంగా, మవునంగా ఉండిపోయిన పార్వతీశాన్ని చూసి ముసి ముసిగా నవ్వుకున్నాడు రామ్మూర్తి. పార్వతీశంలో అంతర్లీనంగా అల్లుకు పోయి నైరాశ్యాన్ని, ఆశా భంగాన్ని ముగింపు దశకు తెచ్చి, తిరిగి అతని జీవితంలో వేడుక వెలుగులు నింపటానికి ఒక స్నేహితునిగా తన కర్తవ్యాన్ని తాను నెరవేర్చానన్న భావం రామ్మూర్తికి అవధుల్లేని తృప్తిని కలిగించింది. మిత్రబంధానికి భాష్యం వాత్సల్యానురాగాలు సహకార మమకారాలే అన్న సత్యం రామ్మూర్తి మనసులో మధురంగా మెదిలింది.

''పిల్లలు లేరని వ్రాయటం నాకు నచ్చలేదు.'' మంచుకరిగినంత నిశ్శబ్దంగా ఆక్షేపించాడు పార్వతీశం. తనలోతాను నవ్వుకున్నాడు రామ్మూర్తి.

''ముందు మళ్ళీ నీవో ఇంటివాడివికా, పార్వతీశం! ఆ తరవాత అన్ని విషయాలు సర్ది చెప్పొచ్చు.''

సందేహాలు, సంకోచాలుగంద్ర గోళం రేపుతున్నా ఏదో ఆశ, ఆ ఆశ కొసల నుండి పుట్టుకొస్తున్న పులకరింత పార్వతీశాన్ని నోరెత్త నీయలేదు. కుడి ఎడమల తారతమ్యం లేని అనుభవ తీరాన, అన్ని తపనలకు, చింతనలకు అతీతంగా కలలను సార్థక పరుచుకున్నట్లుగా సేద తీరుతున్న భంగిమలో పార్వతీశం విసిరిన చిన్న రాయి పెట్టే చక్కిలిగింతలకు ప్రశాంత సరోవానికి ఎన్ని పులకరింతలు. ఎన్నెన్ని కలరింతలు. పార్వతీశం మనసూ అదే స్థితిలో అదే అస్తిత్వంలో.

కాలం తన నైమిత్తిక కార్యక్రమంలో నిమగ్నమై పోయి ఉంది. కాలెండర్ లోని ఒక కాగితం మారేంతలోనే, సంతానం లేదని చెప్పబడ్డ ఒక వితంతువును చేపట్టి పార్వతీశం మళ్ళీ ఒక ఇంటివాడయ్యాడు. ఒదిగి పోయే చరిత్రలో తనకూ, తన దైన ఒక అస్తిత్వచిహ్నం మిగుల్చుకున్నట్లు, మవున విషాద నీడల జీవితం నుండి పక్కకు తప్పుకుని ఏదో విముక్తి పథంలోకి వచ్చినట్లు నిబ్బరంగా ఉండి పోయాడు పార్వతీశం. ఆనందోద్వేగాల అనుభవాల్ని అందిస్తూ, వివాదాల కతీతంగా, విచిత్ర బంధంగా ముడి వేసుకుపోయిన నూతన అర్ధాంగితో సరి పెట్టుకో సాగాడు పార్వతీశం. ఆ తరవాత శ్రీమతిగా, సహ ధర్మచారిణిగా ఆమె చేరువై, సన్నిహితమై తనలో కలిసిపోయిన ఒకానొకతరుణంలో ఆమె మత్తు చూపుల్లో చూపుల్లో కలిపి అడిగాడు పార్వతీశం.

''పిల్లలంటే నీ కిష్టమేనా?'' పార్వతీశం కళ్ళల్లోకి ప్రశ్నార్థకంగా చూసింది శ్రీమతి. జంకుగా చూసింది. ఆ జంకులోనే అంత కథ దాగిందని పార్వతీశానికి అప్పట్లో తెలియలే.

''చెప్పు మరి, ఇష్టమేనా?'' ఆమె పెదాలపై కుడి చేయి చూపుడు వేలుతో సుతారంగా గీతలు గీస్తూ అడిగాడు పార్వతీశం. శ్రీమతి తలూపింది.

ఆ మరునటి రోజే, గతించిన భార్య తల్లిగారి వద్ద ఉన్న ముగ్గురు పిల్లల్ని తీసుకొచ్చి బెరుకు బెరుకుగా విషయం వివరించాడు కొత్త శ్రీమతికి పార్వతీశం. ఆ పిల్లల్ని చూసి ఆమె లబో దిబో మని గుండె బాదుకోలేదు. భంగు తినలేదు. చిర్రు బుర్రు లాడలేదు. నాకు అన్యాయం చేశారు నాయ

